ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 28 నవంబరు 2024



కొప్పర్తికి పరిశ్రమల క్యూ

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో మళ్లీ పారిశ్రామికరంగం పూర్వవైభవం సంతరించుకుంటోంది. పలు భారీ పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమను హార్టికల్చర్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సోలార్, విండ్‌పవర్ హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కొప్పర్తి పారిశ్రామికవాడలో నాలుగు వేల మందికి ఉపాధి కల్పించే పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇదెప్పుడో కాదు.. వచ్చే ఏడాది జనవరిలోనే కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పరిశ్రమలు ప్రారంభం కానున్నాయి. ఇది నిరుద్యోగులకు వరంగా మారనుంది.

- రూ.70కోట్లతో చానల్‌ప్లై పరిశ్రమ ఏర్పాటు
- రూ.120కోట్లతో టెక్నోడోమ్ పరిశ్రమ కూడా
- రూ.45కోట్లతో డీజీజీ ఎక్స్‌పోర్ట్ గార్మెంట్ పరిశ్రమ
- నాలుగు వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- జనవరిలో మంత్రి లోకేశ్ చేతులమీదుగా ప్రారంభం

యువగళం పాదయాత్రలో భాగంగా కడపలో రాయలసీమ అభివృద్ధికి డిక్లరేషన్ ప్రకటిస్తున్న సందర్భంగా ప్రజలకు నారా లోకేశ్ అభివాదం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కృతనిశ్చయంతో ఉన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు నూతన పాలసీ విధానం రూపొందిస్తున్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉండడంతో కడపవైపు పారిశ్రామిక వేత్తలు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే కొప్పర్తి పారిశ్రామిక వాడలో టెక్స్‌టైల్ పరిశ్రమ నడుస్తోంది. ఇందులో 1100 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. పలు చిన్నాచితకా పరిశ్రమలు ఉన్నాయి. అయితే ఇప్పుడు దాదాపు 4 వేలమందికి ఉద్యోగాలు కల్పించే మూడు పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. వీటికి సంబంధించి డిసెంబరు నుంచే ప్లానింగ్ మొదలుపెడుతున్నట్లు తెలుస్తోంది. కొప్పర్తిని మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తున్నారు. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్, మాన్యుఫ్యాక్చరర్, మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలకు అనుగుణంగా తయారుచేశారు. తొలిదశలో ఎలక్ట్రానిక్ మ్యాన్యుఫ్యాక్చరర్ కోసం 500ఎకరాలు, రెండో దశలో 265.5 ఎకరాలు అభివృద్ధి చేసేందుకు ఏపీఐఐసీ ప్రణాళికలు రూపొందించింది. పారిశ్రామికవాడలో రోడ్లు, పైప్‌లైన్లు, విద్యుత్ ఇతర మౌలిక వసతులు కల్పించారు.



కొప్పర్తి పారిశ్రామిక వాడ

రూ.70కోట్లతో చానల్‌ప్లై పరిశ్రమ

సౌండ్‌సిస్టం తయారీలో పేరొందిన చానల్‌ప్లై పరిశ్రమ కొప్పర్తిలో ఏర్పాటుకానుంది. దీనికోసం ఎకరాకు రూ.20లక్షల చొప్పున 8ఎకరాల భూమి కేటాయించారు. 900 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయి. ప్రస్తుతానికి డిసెంబరులోనే షెడ్‌లో ప్రారంభించి ట్రైనింగ్ ప్రోగ్రాం చేపట్టనుంది. టీవీల తయారీలో పేరొందిన టెక్నోడోమ్ పరిశ్రమ 7 ఎకరాల్లో ప్రారంభించనున్నారు. రూ.120కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. 800 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ పరిశ్రమ జనవరిలో ప్రారంభంకానుంది. ఇక డీజీజీ ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ పరిశ్రమ కోసం 17.12ఎకరాలు కేటాయించారు. రూ.45కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటు కానుంది. 2,100 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ఇది కూడా డిసెంబరులోనే ట్రైనింగ్ మొదలుపెట్టనుంది. ఈ పరిశ్రమ సైతం జనవరిలో ప్రారంభం కానుంది.

మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా

కొప్పర్తిలో ఏర్పాటుచేసే మూడు పరిశ్రమలను మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా జనవరిలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే మూడు పరిశ్రమలు కూడా త్వరితగతిన పనులు మొదలుపెట్టనున్నాయి. డిసెంబరు నుంచే ట్రైనింగ్ ఇచ్చి జనవరి నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ కడప కేంద్రంగా రాయలసీమ అభివృద్ధి ప్రణాళికను ప్రకటించారు. ఆ మేరకు ఆయన అడుగులు వేస్తున్నారు. కొప్పర్తి కూడా పరిశ్రమల ఏర్పాటుకు అనుగుణంగా ఉంది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉండడంతో పరిశ్రమల ఏర్పాటుకు కంపెనీలు సైతం ముందుకు వస్తున్నాయి.

కొప్పర్తికి మరిన్ని పరిశ్రమలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో కొప్పర్తిలో పలు పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. జనవరిలో మూడు పరిశ్రమలు ప్రారంభం అవుతాయి. ఫార్మా కంపెనీ కూడా వచ్చేందుకు సిద్ధంగా ఉంది.



- కె.శ్రీనివాసమూర్తి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, కడప

పొలతలకు రూ.32 లక్షల ఆదాయం



స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పెండ్లిమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం పొలతలలోని హుండీల కానుకల ద్వారా రూ.32లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ తెలిపారు. మల్లేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ దేవస్థానాలైన అక్కదేవతల ఆలయం, బద్దెనస్వామి దేవస్థానం, అన్నదాన హుండీలను దేవదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. అక్కదేవతల దేవస్థానం హుండీ ద్వారా రూ.30,28,861, బద్దెనస్వామి దేవస్థానం హుండీ ద్వారా రూ.1,52,441, అన్నదానం హుండీ ద్వారా రూ.3470.. మొత్తం రూ.31,84,872 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. నగదుతో పాటు 35గ్రాముల బంగారం, నాలుగు కిలోల వెండి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ 29కి వాయిదా

కడప రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ బుధవారం విచారణకు రాగా ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వెంకటేశ్వరరావు 29వ తేదీకి వాయిదా వేశారు. వైసీపీ సోషల్ మీడియాలో అప్పటి ప్రతిపక్ష పార్టీలకు చెందిన చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యవహారంలో పులివెందులలో హరి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో బండి రాఘవరెడ్డి ఏ-20 నిందితుడిగా ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు అరెస్టు చేయగా ఆయన ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అప్పటి నుంచి బండి రాఘవరెడ్డికోసం పోలీసులు వెతుకుతున్నారు.

ఈ కేసులో పోలీసులు తనను అరెస్టు చేయకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఇప్పటికే కస్టడీ పిటిషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) బాలాజీ వాదనలు వినిపించారు. ఇతను ఎంపీకి పీఏ అని, అప్పటి ప్రతిపక్ష నాయకులపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టిన విషయంలో కీలకంగా వ్యవహరించారని ఇతను అరెస్టు కాకుండా బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేస్తారని విన్నవించారు. అయితే బండి రాఘవరెడ్డికి బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరుపు న్యాయవాదులు వాదించారు. ఇరువురి వాదలను విన్న న్యాయాధికారి దీనబాబు తదుపరి ఆదేశాల కోసం వాయిదా వేశారు. అయితే ఆయన సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్ బుధవారం విచారణకు రాగా జడ్జి శుక్రవారానికి వాయిదా వేశారు.

జేసీ వస్తాడని.. హైటెన్షన్

- సరిహద్దులో భారీగా పోలీసుల మోహరింపు
- చెక్‌పోస్టు వద్ద రాత్రి కూడా బందోబస్తు

కొండాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఆర్టీపీపీ వద్ద తమ వాహనాలను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డుకుంటే తానే అక్కడకు వెళతానని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చెప్పడంతో జిల్లా సరిహద్దులో హైటెన్షన్ నెలకొంది. తాడిపత్రి నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తారని బుధవారం ఉదయం 6గంటల నుంచే కొండాపురం మండలం కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద పోలీసులు మోహరించారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, స్పెషల్‌పార్టీతో కలిసి సుమారు 80మంది పోలీసులు ఇక్కడకు చేరుకున్నారు. తాడిపత్రి నుంచి ఆర్టీపీపీకి వెళుతున్న లారీలను ఆపి వివరాలను తీసుకుని పంపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తే పోలీసులు అడ్డుకుంటారని విపరీతంగా ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని పోలీసుల వద్ద ప్రస్తావించగా మందిమార్బలంతో వస్తే అడ్డుకుంటామని, ఒకటి లేదా రెండు వాహనాల్లో వెళితే అభ్యంతరం చెప్పమని అన్నారు. దీంతో కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం రాలేదు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ బుధవారం సాయంత్రం చెక్‌పోస్టు వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. సిబ్బందికి తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో 144 సెక్షన్‌ను విధించినట్లు కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. కాగా.. కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి కూడా బందోబస్తు నిర్వహించనున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై రుషికేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి పూర్తి బందోబస్తు ఉంటుందన్నారు.



కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద భారీగా మోహరించిన పోలీసులు

ఆర్భాటపు పెళ్లిళ్లు.. అప్పుల పాలు..



- భారమైపోతున్న పెళ్లి ఖర్చులు
- చితికిపోతున్న మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు
- నియంత్రణలేని హంగులు, ఆర్భాటాలు, విందులు, వినోదాలు

6

‘రిమ్స్’ ప్రొఫెసర్లపై
విచారణకు నోటీసులు

- ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌పై కూడా..
- ఆరేళ్ల తర్వాత విచారణపై కదలికలు

6

ఎత్తిపోతల పథకం హామీకి
ఐదేళ్లు

- 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, జగన్ హామీలు
- ఎత్తిపోతల పథకంతో పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామంటూ జగన్ గొప్పలు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

7

బీమాతో రైతన్నకు ధీమా



అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

పంటలకు బీమా చేయండి..

రబీ సీజనులో సాగవుతున్న పంటలకు సంబంధించి బీమా చేయడం ద్వారా తగిన రక్షణ పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే బీమా పరిహారం పొందే సౌకర్యం ఉంటుంది. ప్రతి రైతు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- ఎ.నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, కడప

- జిల్లాలో 8 పంటలకు అవకాశం
- అత్యధికంగా వరికి ఎకరాకు రూ.42వేలు పరిహారం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంటలకు బీమా చేయడం వల్ల రైతన్నకు ధీమా లభిస్తుంది. అనుకోని విపత్తులతో పంటలు దెబతిన్నాయంటే పరిహారం అందడంతో కాస్త ఊరటగా ఉంటుంది. 2024-25 రబీ సీజన్ పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. తుఫాన్లు, కరువు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడులు నష్టపోయిన రైతన్నలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లిస్తారు. ఈ మేరకు జిల్లాలో 8 పంటలను బీమా కోసం ఎంపిక చేశారు. ఈ ఎంపిక చేసిన పంటలకు నిర్ణీత సమయంలో రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకుల ద్వారా రుణం తీసుకున్న రైతులు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ప్రీమియం నేరుగా బ్యాంకులు రుణంలోనే మినహాయింపు చేసుకుంటాయి. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటరు సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంటు, పోస్టాఫీసుల్లో ప్రీమియం మొత్తం చెల్లించవచ్చు. రైతు ఆధార్‌కార్డు, భూమి, కౌలు కార్డు, పంట వేసిన ధ్రువపత్రం, బ్యాంకు వివరాలకు సంబంధించిన పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో ఎలాంటి మధ్యవర్తులను నమ్మవద్దని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది. పంట సాగుచేసిన ధ్రువపత్రం తీసుకునేందుకు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన పనిలేదు.

రైతులు చెల్లించాల్సిన ప్రీమియం (ఎకరాకు), అందే పరిహారం రూ.లలో..

పంట	చెల్లించాల్సిన ప్రీమియం	పంటనష్టపోతే అందే బీమా
నువ్వులు	180	12,000
వేరుశనగ	480	32,000
పెసలు	270	18,000
జొన్నలు	315	21,000
మినుము	285	19,000
వరి	630	42,000
సన్‌ఫ్లవర్	300	27,000
శెనగలు	480	32,000

8 పంటలకు అవకాశం

జిల్లాలో రబీ సీజన్‌లో సాగవుతున్న 8 పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎంపిక చేశారు. ఇందులో నువ్వులు, వేరుశెనగ, పెసలు, జొన్నలు, మినుములు, వరి, ప్రొద్దుతిరుగుడు, శెనగ పంటలు ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆయా పంటలు నష్టపోతే వీటికి పరిహారం అందుతుంది. అందులో వరిపంటకు మాత్రమే డిసెంబరు 31 వరకు గడువు ఉండగా మిగిలిన అన్ని పంటలకు డిసెంబరు 15 లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

నేటి ఆధునిక యుగంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు పెళ్లిళ్ల ఖర్చులు పెనుభారంగా మారాయి. తల్లిదండ్రులకు పెళ్లిళ్ల ఖర్చులు తలకుమించిన భారమై అప్పులపాలవుతున్నారు. అదో ఫలాన రామయ్య, ఇదిగో ఎల్లయ్య, అదో చంద్రయ్య ఆర్భాటంగా పెళ్లిళ్లు చేసి అప్పులపాలై ఉన్న ఇళ్లు, భూమి అమ్ముకున్నారన్న వార్తలే వినిపిస్తున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు కోటీశ్వరులను చూసి వారితో పోటీపడి మధ్య తరగతికి చెందిన యువతీ, యువకులు పెళ్లిలో ఆర్భాటాలకు పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. గతంలో అతి తక్కువ ఖర్చుతో తమ ఇంటి ముంగిళ్లల్లోనే చలువ పందిళ్లు వేసుకుని కేవలం వేల రూపాయలతోనే పెళ్లి తంతు ముగించేవారు. ఇప్పుడు పెళ్లిళ్లకు లక్షలు దాటి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు.


పెళ్లిళ్ల కోసం పెద్దఎత్తున సెట్టింగ్‌లు

పెళ్లి ఖర్చులను నియంత్రించాలి..



నేడు ఆర్భాటపు పెళ్లి ఖర్చులు మధ్యతగరతి కుటుంబీకులను, సామాన్యులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. దీనిపై ఆయా గ్రామాల్లోని మేధావులు, పెద్దలు, ప్రముఖులు కలిసి అందరూ చర్చించుకుని ఆర్భాటపు పెళ్లిళ్లకు చరమగీతం పాడాలి. తిరిగి పాతరోజులు రావాలి. వధూవరుల ఇంటి వద్దే, ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చావిళ్ల వద్ద అతి తక్కువ ఖర్చుతో సంప్రదాయ పెళ్లిళ్లు చేయాలి. అందులో ఉన్న మజా ఎందులోనూ ఉండదు. దీనిపై అందరూ ఆలోచించి తక్కువ ఖర్చుతో సంప్రదాయ పెళ్లిళ్లకు నడుం బిగిస్తే తప్ప ఖర్చులను నియంత్రించలేం. సమాజంలో మార్పు వస్తేనే ఇది సాధ్యం.

- సింగంశెట్టి కృష్ణకుమార్, న్యాయవాది, రాజంపేట


పెళ్లి మండపానికి భారీ ముస్తాబు

ఆర్భాటపు పెళ్లిళ్లు.. అప్పుల పాలు...



- భారమైపోతున్న పెళ్లి ఖర్చులు
- చితికిపోతున్న మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు
- నియంత్రణలేని హంగులు, ఆర్భాటాలు, విందులు, వినోదాలు


పెళ్లివేదిక ముంగిట పెద్దఎత్తున విద్యుద్దీపాలంకరణ


అందంగా స్వాగత తోరణాలు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేటి హైటెక్ యుగంలో వివాహతంతు మధ్యతరగతి కుటుంబీకులను కుంగదీస్తోంది. ఈ వివాహ ఘట్టంలో జరిగే ఆడంబరాలకు సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు లక్షల్లో ఖర్చులు చేసి పెళ్లిళ్లు చేయడం వల్ల అప్పులపాలై కుంగిపోతున్నారు. స్థోమతకు మించిన ఖర్చులు చేసి అష్టకష్టాలు పాలవుతున్నారు. ఒకప్పుడు మన పూర్వీకులు వివాహాలను ఇళ్ల ముంగిళ్లలోను, గ్రామచావిడిలలోను, ఆయా గ్రామాల ఆలయాల్లో నిరాడంబరంగా చేసుకునేవారు. చలువపందిళ్లు, మామిడితోరణాలు, అరటి పిలకలతో పాటు ఓపాటి మైకుసెట్, ఆయా గ్రామాలకు చెందిన మంగళవాయిద్యాలు అవసరమైతే ఓ మోస్తరు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకుని అతి తక్కువ ఖర్చుతో చేసుకునేవారు. లడ్డు, కారాలు, పాయసం, పప్పన్నంతో ఈ తంతు ముగించేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అసలు పెళ్లంటేనే ప్రధానంగా పెళ్లికుమార్తె తల్లిదండ్రులకు ఆర్థిక గండంగా మారిపోయింది. ప్రధానంగా ఇప్పుడు పెళ్లంటే పెద్ద పెద్ద కల్యాణమండపాల్లో భారీ సెట్టింగ్‌లు, భారీ విద్యుద్దీపాలంకరణ, పెద్దఎత్తున స్వాగత తోరణాలు, వచ్చిన అతిథులకు హైటెక్ రీతిలో కొత్త కొత్త హంగులతో ఏర్పాట్లు, 10 రకాల స్వీట్లతో కూడిన విందు ఏర్పాట్లు, ముత్యాల పల్లకీలు, వేదికపై పూల సెట్టింగ్‌లు, ప్రధానంగా ఆర్కెస్ట్రా ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంతా ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మామూలుగా అనాది నుంచి పెళ్లి కుమారుడికి పెళ్లికుమార్తె తరఫున కట్నకానుకలు ఇచ్చేవారు. ఆ కట్నకానుకలు ఇప్పుడూ కొనసాగుతున్నాయి. గతంలో అయితే పెళ్లి కుమారునికి ఏమిచ్చేవారు అని అడిగేవారు. ఇప్పుడు అలా కాకుండా ఇప్పుడు మీ అమ్మాయికి పెద్దఎత్తున నగలు చేయించుకోండి, అలాగే పెళ్లికుమారునికి చేయించండి, మీరిచ్చే స్థిరాస్తులను ఇద్దరి పేరిట రాయించండి, పెళ్లిని పెద్ద కల్యాణమండపంలో చేయించండి, పెళ్లిలో మెనూ ఇలా ఉండాలని పెళ్లికుమారుడి బంధువులు చెప్పేస్తున్నారు. ప్రేమ వివాహాలు మినహా మిగిలిన వివాహాలన్నీ ఇలాగే జరిగిపోతున్నాయి. ఇలా పెళ్లికుమార్తెకు, పెళ్లి కుమారుడికి బంగారు ఆభరణాలు, వారికిచ్చే స్థిరాస్తులు లక్షలు దాటిపోతున్నాయి. ఒక మధ్య తరగతి పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు వీటికే అరకోటి పైబడుతోంది. తిరిగి ఆడంబరపు పెళ్లి ఖర్చులు కనీసం 30 లక్షలు పైబడుతోంది. పెళ్లికి ముందు నిశ్చితార్థం పేరిట లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఒక్క పెళ్లి తంతు మొదలైతే నిశ్చయతాంబూలాకు లక్ష, నిశ్చితార్థానికి 5 లక్షలు, కల్యాణం రోజున కల్యాణమండపానికి 2 లక్షలు, స్టేజిపై పూలంకరణ 5 లక్షలు, ఆర్కెస్ట్రాకు కనీసం లక్ష, మంగళవాయిద్యాలకు లక్ష, భోజనాలకు 5 నుంచి 10 లక్షలు, డ్రోన్ కెమెరాలకు, వీడియోలకు 2 నుంచి 5 లక్షలు, సెట్టింగులకు, డెకరేషన్లకు, స్వాగత తోరణాలకు మరో 5 లక్షలు ఖర్చవుతోంది. మలిపెళ్లి పేరిట విందు వినోదాలకే మరో 2 లక్షలు దాటుతోంది. తిరిగి నూతన వధువును వరుడి ఇంటికి పంపడానికి లక్ష నుంచి 2 లక్షలు పైబడుతోంది. ఇలా చెప్పలేని ఖర్చులు మధ్యతరగతి కుటుంబానికి అరకోటి రూపాయలు దాటుతాయి. ఆభరణాలు, వరకట్నం ఇవన్నీ లెక్కలేస్తే రూ.కోట్లు దాటిపోతున్నాయి. ఈ విధంగా పెళ్లి ఖర్చులు మధ్యతరగతి వారికి ఎంతో ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఆర్థికంగా బలపడిన కుటుంబాల్లో ఈ వివాహ వేడుకలు కోట్లను దాటుతున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు మధ్య తరగతి కుటుంబీకులు, సామాన్యులు ఆర్థికంగా బలపడినవారిని చూసి వారు పెళ్లిళ్లు చేసేవిధంగా వీరూ చేస్తూ ఇబ్బందుల పాలవుతున్నారు. పెళ్లి కాకుండానే ప్రధానంగా నిశ్చితార్థం పేరిటే లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ప్రీవెడ్డింగ్, ఫొటో షూటింగ్ సినిమా లెవల్లో పెళ్లికి ముందే వింత సంప్రదాయాలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో ఈ ఆర్భాటపు వింత సంస్కృతి ఎక్కువైపోతోంది. భవిష్యత్ తరాలు ఈ ఆర్భాటపు పెళ్లి ముసుగులో లక్షల్లో ఖర్చు చేసి అప్పుల ఊబిలో మునిగిపోతున్నారు.

పెళ్లి బట్టలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. కొందరైతే 20 రకాల వంటకాలు, పది రకాల ఫ్రూట్‌లు, అల్పాహారం, పది రకాల స్వీట్లు, ఇలా ఒక్కో ప్లేటు భోజనానికి వెయ్యి రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి వచ్చింది. ఈ ఆర్భాటాలన్నీ సామాన్యులకు పెనుభారమవుతోంది. అసలు పెళ్లి పనులు మొదలయ్యాయంటే ఏడాదికి ముందే విలాసవంతమైన కల్యాణ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. ముందు కల్యాణమండపాలు దొరికిన తేదీకే పెళ్లిళ్లు పెట్టుకుంటున్నారు. ఏడాదికి ముందే పెళ్లిళ్లకు వచ్చే అతిథుల కోసం విలాసవంతమైన రూములను బుక్ చేసుకుంటున్నారు. ఈ విధంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు ఈ ఆర్భాటాల పెళ్లిలకు పోయి ప్రధానంగా పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోయి వారికున్న కొద్దిపాటి స్థిరాస్థలను అమ్ముకుని కొందరైతే ఇంటిని కూడా అమ్ముకుని పెళ్లిళ్లకు ఖర్చు చేస్తున్నారు. పెళ్లిళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రధానంగా కుమార్తెను కన్న తల్లిదండ్రులకు పెను సవాల్‌గా మారింది. ఈ విషయంలో ఆయా గ్రామాల పెద్దలు, విశ్లేషకులు, ప్రధానంగా యువతీ యువకులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రముఖులు వీటిపై ఆయా ప్రాంతాల్లోనే సమావేశాలు నిర్వహించి పెళ్లయ్యే యువతీ యువకుల్లోను, వారి తల్లిదండ్రుల్లోను అవగాహనా సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంప్రదాయబద్ధంగా ఇళ్ల ముంగిటే అతితక్కువ మందితో పెళ్లిళ్లు నిర్వహించి ఖర్చులు నియంత్రించి వరకట్నాలను దూరం చేయడానికి విజ్ఞులు, విద్యావంతులు అవగాహన తెస్తే తప్ప ఈ పెళ్లి ఆర్భాటాలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులు బయటపడే పరిస్థితి కనిపించడం లేదు.

అప్పులు చేసి ఆర్భాటంగా పెళ్లి చేయడమెందుకు..



అప్పులు చేసి ఆర్భాటంగా పెళ్లి చేయాల్సిన పనేముంది. ఎవరో కోటీశ్వరుడు ఆర్భాటంగా పెళ్లి చేశారని సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు పోటీ పడడమేంటి. పూర్వీకులు పెళ్లిని ఎంతో పుణ్యకార్యంగా భావించి అతి తక్కువ ఖర్చుతో నిర్వహించేవారు. బంధువులు, గ్రామస్థులతో ఇంటి వద్ద కొన్ని ఫలహారాలు చేసి ముగించేవారు. మంగళవాయిద్యాలు, మామిడితోరణాలు, చలువపందిళ్లు, అరటి పిలకతోనే ఇంటిముంగిట కల్యాణమండపాన్ని ఏర్పాటు చేసి సంప్రదాయ పద్ధతిలో పెళ్లిళ్లు చేసేవారు. ఇదేమి వింతపోకడో సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి ఆర్భాటంగా పెళ్లిళ్లు చేసి అప్పులపాలు కావడంలో అర్థం ఉందా.

- రవిగోపాల్‌శర్మ, పురోహితుడు, నగరిపాడు, చిట్వేలి

యువతీ యువకుల్లో మార్పు వస్తే సాధ్యం..



యువతీ యువకుల్లో మార్పు వస్తే పెళ్లిల్లో ఆర్భాటపు ఖర్చులు నియంత్రించవచ్చు. చదువుకున్న యువతీ యువకులు ఈ విషయంలో ఎంతో ఆదర్శంగా ముందుకు రావాలి. ఎక్కువ ఖర్చులు చేసి అప్పులపాలై ఆర్భాటపు పెళ్లిళ్లు చేసుకుంటే కుటుంబం అప్పులపాలు కావడం తప్ప ఉపయోగం లేదని గ్రహించాలి. ప్రధానంగా మధ్యతరగతి, సామాన్య కుటుంబాల యువతీ యువకుల్లో ఆర్భాటం లేని ఆదర్శ పెళ్లిళ్లకు ముందుకు రావాలి. తమ తల్లిదండ్రులు, తాము అప్పులు పాలుకాకుండా ఉండగలుగుతామన్న ఆలోచనతో ముందుకు వస్తేనే అన్నివిధాలా మంచిది.

- చల్లా సుధాకర్, సంఘ సేవకుడు, అగ్రహారం

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

సబ్‌కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ నాయకుల ధర్నా


సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీకేఎంయూ నాయకులు

మదనపల్లె టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో పేద రైతుల పొట్టకొడుతున్న తహసీల్దార్ ఖాజాబీపై చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణప్ప ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ మదనపల్లె మండలంలో సన్న, చిన్నకారు రైతులను తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ వీఆర్‌వోలను అడ్డం పెట్టుకుని వేధిస్తున్నారని ఆరోపించారు. ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నాలుగు నెలల్లో మదనపల్లె మండలంలో ఎన్ని మ్యుటేషన్స్ జరిగాయి, ఎంత అవినీతి జరిగిందో సబ్‌కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని కోరారు. సాంబశివ మాట్లాడుతూ గతంలో గుర్రంకొండలో పనిచేసినప్పుడు కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయని, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ ఇన్‌చార్జి డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు చంద్రశేఖర్, మురళి, హరి, సుశీల, నరసింహులు పాల్గొన్నారు.

'రిమ్స్' ప్రొఫెసర్లపై విచారణకు నోటీసులు

- ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌పై కూడా...
- ఆరేళ్ల తరువాత విచారణపై కదలికలు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప 'రిమ్స్' వైద్యశాల, రిమ్స్ వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు వైద్యులు, ఒక బోధనాపరమైన అధ్యాపకుడు, మరో ఆసుపత్రి సూపరింటెండెంట్‌లపై విచారణకు ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2016లో రిమ్స్‌లో వెలుగులోకి వచ్చిన అవకతవకలపై ఏసీబీ విచారణ జరిపింది. దీనిపైన 2016 ఏప్రిల్ 16 సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఏసీబీ అందజేసిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం మొత్తం ఐదుగురిపై అభియోగాలు నమోదు చేసి వారి నుంచి 2018 అక్టోబరు 26న సంజాయిషీలు తెలుపుకోవడానికి అవకాశమిస్తూ నోటీసులు జారీ చేసింది. అప్పట్లో రిమ్స్ వైద్యశాల సాధారణ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, ఆర్థోపెడిక్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జొన్నా నగేష్, ఆసుపత్రి కార్యాలయం సూపరింటెండెంట్ లాల్‌బంద్ షేక్ మహబూబ్ బాషా, మరో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవయ్య, రిమ్స్ వైద్య కళాశాల కంటి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీడీఎల్ సత్యనారాయణలపై నమోదైన అభియోగాలను వివరిస్తూ ఈ సంజాయిషీ నోటీసులు జారీ అయ్యాయి.

పది రోజుల్లోగా వివరణలు ఇవ్వాలని గడువు విధించింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలన జరిగిన ఐదేళ్లూ ఆ తరువాత జరగాల్సిన విచారణ మూలనపడింది. తాజాగా ఈ వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి విచారణకు ఆదేశించింది. మొత్తం ఐదుగురినీ కలిపి విచారించి నివేదిక సమర్పించడానికి తిరుపతి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును విచారణాధికారిగా నియమించింది. రెండు నెలల్లోగా విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా కూడా ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించిన అన్ని రికార్డులను విచారణాధికారికి అందచేయాలని వైద్య విద్య డైరెక్టరును ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్‌మణి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో సుబ్రమణ్యం

నందలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధన అభ్యాసన ప్రక్రియలు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఉపాధ్యాయులకు సంబంధించి అకడమిక్ మానిటరింగ్ అంశాలను పర్యవేక్షించారు. పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీసీడీవో ఎస్.శశికళ, డీఈవో కార్యాలయ క్యాంపు క్లర్కు ఎస్.హబీబ్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రౌఫ్ బాషా, పాఠశాల ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు ప్రజల రుణం తీర్చుకుంటా

రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి


చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కేకే చౌదరి

రైల్వేకోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్‌గా తాను ప్రజలకు ఏమి చేయగలనో అవన్నీ చేసి చూపిస్తామని తెలిపారు. నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఎలాంటి చెడ్డ పేరు తీసుకుని రాకుండా పరిపూర్ణమైన సేవలు ప్రజలకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్, అడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

- క్రీడలతో మానసిక ఉల్లాసం...
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో గల పోలీస్ పెరేడ్ మైదానంలో బుధవారం జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఎగురవేసి, స్టేట్ మీట్‌లో డెకాత్లాన్‌లోని 10 ఈవెంట్లలో వరుసగా మూడు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన ఉమెన్ పీసీ శశికళ ఎస్పీకి క్రీడా జ్యోతిని అందించగా ఎస్పీ క్రీడాజ్యోతిని వెలిగించి మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలోని క్రీడా ప్రతిభను వెలికితీయడానికి పోలీసు స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపుతుందన్నారు. ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయని, 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీసు సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడా ప్రతిభకు గుర్తింపు తీసుకువస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీసు మీట్‌కు పంపిస్తామన్నారు. పిల్లల్ని కూడా గేమ్స్ ఎక్కువగా ఆడించాలన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లాలో పోలీసు స్పోర్ట్స్ మీట్ జరుగుతోందని తెలిపారు. అలాగే 27, 28, 29 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు సాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 4 జోన్లకు సంబంధించిన నాలుగు టీమ్‌లు (రాయచోటి, మదనపల్లె, రాజంపేట, ఏఆర్ హెడ్ క్వార్టర్స్) కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, క్రికెట్, టెన్నిస్, షటిల్ మొదలగు క్రీడల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, రాజంపేట డీఎస్పీ సుధాకర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు - క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పోలీసు క్రీడాకారులు

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండా అంశాలపై సమీక్షించారు. ఇందులో జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల ప్రమాద డేటా విశ్లేషణ, మూడు కంటే ఎక్కువ మరణాలపై ఉమ్మడి తనిఖీ అంశాలపై సమీక్షించారు.

ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్స్ అండ్ డెత్ డేటాపై సమీక్షించారు. వచ్చే ఏడాది 2024-25 కోసం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సరిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను అమలుపరచడం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, హిట్ అండ్‌రన్ కేసుల బాధితులకు పరిహారం, గత రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ఇందులో 2023, 2024లో ఇప్పటి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలపై సమీక్షించారు. 2023లో మొత్తం 593 ప్రమాదాలు జరగగా, ఇందులో 274 ప్రాణాంతకం కేసులు, 319 ప్రాణాంతకం కానివి, 314 మరణాలు, 786 మంది గాయపడినట్లు తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు మొత్తం 533 ప్రమాదాలు జరగగా, ఇందులో 255 ప్రాణాంతకం కేసులు, 278 ప్రాణాంతకం కానివి, 289 మరణాలు, 656 మంది గాయపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయని, ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, పోలీసు, అనుబంధ శాఖల అధికారులు, రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి ప్రసాద్, ఎంవీఐలు, పోలీసుశాఖ అధికారులు, డీఎస్పీలు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం హామీకి ఐదేళ్లు

- 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, జగన్ హామీలు
- ఎత్తిపోతల పథకంతో పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామంటూ జగన్ గొప్పలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఊసే లేని వైనం
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు



గోపవరం మండలం బ్రాహ్మణపల్లె వద్ద సోమశిల వెనుక జలాలు (ఫైల్)

బద్వేలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నుంచి ప్రవాహం కాకుండా వృథాగా మిగిలిపోతున్న ప్రాజెక్టుల వెనుక జలాలను ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ రిగేషన్) ద్వారా కాల్వలు, చెరువులకు నీటిని తరలిస్తే పంట పొలాలు సస్యశ్యామలం అవు తాయి. ఆ దిశగా సోమశిల ప్రాజెక్టు వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల చెరువులకు మళ్లిస్తే వాటి ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల భూములు పచ్చని పంటలతో కళకళలాడే అవకాశం ఉంది. ఆ దిశగా నూత నంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవా లంటూ ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

గోపవరం మండలం బ్రాహ్మణపల్లె వద్ద ఉన్న సోమశిల వెనుక జలాల వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తే దాదాపు గోప వరం, బద్వేలు, అట్లూరు మండలాల్లోని 36 చెరవులకు సాగు నీరందించే అవకాశం ఉంది. ఈ మూడు మండలాల్లోని చెరువులను నీటితో నింపినట్లయితే పంట పొలాలు సస్యశ్యామలంగా మారే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతంలోని రైతులు ఎత్తిపోతల పథకం నిర్మిస్తే తమ బతుకులు బాగు పడుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల ప్రచారంలో హామీలు..

2019లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్థానిక ఎస్‌బీవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో సోమశిల వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా మూడుమండలాల చెరువులకు సాగునీరు అందిస్తామని.. హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన జీవోలు కూడా జారీ చేశామని.. మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలి పారు. అలాగే స్థానిక నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బం కు వద్ద నిర్వహించిన జగన్ రోడ్‌షోలో తమ ప్రభుత్వం అధి కారం లోకి వస్తే సోమశిల వెనుకజలాలను ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగునీరందించి పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామని గొప్పగా హామీ ఇచ్చారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊసే లేదు

2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లా వాసి వైఎస్ జగన్ సీఎం కావడంతో ఎత్తిపోతల పథ కంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్నా ఎత్తిపోతల పథకం ఊసే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వానికి బద్వేలు నియోజకవర్గం మరో పులివెందులగా నిలచినప్పటికీ ఈ ప్రాంత రైతాంగానికి జగన్ ఐదేళ్ల అధికారంలో ఉన్నా హామీ అమలుపరచలేకపోయారు.

ఎత్తిపోతల పథకంపై పోరాటాలు

బ్రాహ్మణపల్లె సమీపంలోని సోమశిల వెనక జలాల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలంటూ 2018లో సోమశిల ఎత్తిపోతల సాధన సమితి ఏర్పాటు చేసి పలుమార్లు పోరాటాలు సాగించారు. ఇందులో భాగంగా సోమశిల వెనక జలాలవద్ద నుంచి బద్వేలులోని నాలుగు రోడ్ల కూడలి వరకు పాదయాత్రల నిర్వహించారు. వారి పోరాటాల ఫలితంగానే అప్పట్లో ఇరుపార్టీల అధినేతలు ఎత్తిపోతల పథకం అవశ్యకత గుర్తించి హామీలు ఇచ్చారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మిస్తుందని ఐదేళ్లుగా ఎదురు చూసినా ఫలితం లేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

2019 ఎన్నికల ప్రచారంలో అప్పటి సీఎం చంద్రబాబు సోమశిల ఎత్తిపోతల పథకంపై హామీ ఇవ్వడం.. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోవడం జరిగింది. తిరిగి 2024 ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆనాటి హామీని గుర్తుంచుకుని చంద్రబాబు సోమశిల ఎత్తిపోతల పథకం నిర్మిస్తారని కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏహెచ్‌ఏలను పశుసంవర్ధకశాఖలో విలీనం చేయాలి


పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మకు వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

కడప రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న (ఏహెచ్‌ఏ) వారిని పశుసంవర్ధకశాఖలో విలీనం చేయాలని ఏపీఎన్జీఎఫ్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్, నేతలు గణపతిరెడ్డి, ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మను కలిసి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ ఏహెచ్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. పశుసంవర్ధకశాఖకు సంబంధంలేని అదనపు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించగా శారదమ్మ సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఆరిఫ్, ఇమ్మానుయేల్, శివయ్య, హిమజ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో రేఖామునికి కాంస్యపతకం




కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైవీయూకు చెందిన రేఖాముని అనే పీజీ విద్యార్థిని అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. నాగార్జున యూనివర్శిటీలో జరుగుతున్న దక్షిణ, పశ్చిమ భారత అంతర్ విశ్వ విద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రేఖాముని 45 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈమె సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువు తున్నా రు. రేఖామునిని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, వ్యాయామ విద్య సంచాలకులు సుబ్బారెడ్డిలు అభినందించారు.

మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈఓ మీనాక్షి తెలి పారు. బుధవారం కడప నగరం మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని మరింత మెరుగ్గా చేయాలని సూచించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఖాజాపీర్, ఆయూబ్ పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి



ఐటీఐ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనరు ఓ.నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఐటీఐ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ రాయలసీమ కరువు ప్రాంతంగా మారి రైతుల ఆత్మహత్యలకు నిలయమైందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, వేణు, అనిల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత దేశంగా చూడటమే లక్ష్యం


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

కడప కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ రహిత దేశంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణదేవి పిలుపు నిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ, ప్రచార కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారిణి శ్రీలక్ష్మీతో పాటు అధికారులు పాల్గొన్నారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని.. వివాహ వయసుపై అవ గాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలిక లకు మంచి విద్యను అందించే బాధ్యత తల్లిదండ్రులదన్నారు. మహిళలు అనేక రంగాలలో రాణిస్తున్నారని.. అందుకే సుప్రీం కోర్టు ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొ ందించి.. అన్ని శాఖల సమన్వయంతో బాల్య వివాహ రహిత దేశంగా తయారు చేయటానికి ప్రధాని ఆధ్వర్యంలో పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, మీనాక్షి తదితరులు పాలొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

105 గ్రాములు బంగారు, 116 గ్రాముల వెండి రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు

పులివెందుల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాధరెడ్డి అనే ఉపాధ్యాయుడి నివాసంలో జూలై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పులివెందుల చెన్నారెడ్డికాలనీకి చెందిన విశ్వనాధరెడ్డి కుటుంబ సభ్యులు సొంత పని నిమిత్తం కడపకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి తాళాలు పగల గొట్టి ఇంట్లో ఉన్న 105 గ్రాముల బంగారు, 116 గ్రాములు వెండి వస్తువులను దొంగలించారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ, డీఎస్పీ మురళీ ఆదేశాల మేరకు రెండు టీంలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ముద్దనూరు రింగు రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న లింగుభేరి రాంబాబు, నడింపల్లి గోపి, సోనుకుమార్ రాయ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల బంగారు, 116 గ్రాములు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రావు రమేశ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటల్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

- రూ.2లక్షల మేర ఆస్తినష్టం



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి

కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరే గడంతో ల్యాబ్‌లోని వస్తువులు కాలిపోయాయి. ఫైర్ స్టేషన్ సిబ్బంది వివరాల మేరకు... కడప శంకరాపురంలోని డాక్టర్ మామిళ్ల నాగప్రశాంత్ ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో దాదాపు రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు చేసింది.

మంచు కురిసే వేళ...


ఇటు తుఫాన్ ప్రభావం, నవంబరు నెల ఆఖరు కావడంతో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో పంటపొలాలపై మంచు కురవడంతో దుప్పటిలా అలుముకుంది. ఈ దృశ్యం రబీలో సాగు చేసిన శనగ పంటపై ఆహ్లాదకరంగా మారింది. చూపరులను ఆకట్టుకుంది.

- రాజుపాళెం, ఆంధ్రజ్యోతి



కార్తీక మాసం హుండీల లెక్కింపు

కాశీవిశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 99,870 ● మృత్యుంజయకుంట హుండీలో రూ. 72 వేలు

కార్తీక మాసంలో ప్రసిద్ధ ఆలయాల్లో భక్తుల నుంచి వచ్చిన కానుకలు, బహూకరణలు లెక్కించారు. కడప నగరం మృత్యుంజయకుంట ఆలయానికి హుండీ ద్వారా రూ. 72,859 ఆదాయం వచ్చింది. చెన్నూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శివాలపల్లె కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి హుండీ ద్వారా సుమారు రూ.99,870 ఆదాయం వచ్చింది. ఆయా ఆలయాల ఈఓలు ప్రకటించిన వివరాల్లోకెళితే....



మృ త్యుంజయేశ్వర స్వామి దేవస్థానం - కాశీ విశ్వేశ్వర ఆలయం హుండీ లెక్కింపు దృశ్యం

మృత్యుంజయకుంట ఆలయానికి...

కడప కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మృత్యుంజయేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణా ధికారి శ్రీధర్, ప్రధాన అర్చకులు సతీష్‌శశిధర్‌శర్మ, దక్షిణామూర్తి సమక్షంలో లెక్కించగా మూడు నెలలకు రూ. 72,859 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. కార్తీక మాసం నాలుగు సోమవారాలు, కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ ద్వారా స్వామి వారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయంగా రూ.71,581 రాబడిగా వచ్చినట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ ఎన్. ప్రసాద్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో....

చెన్నూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శివాలపల్లె కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీని లెక్కించారు. సుమారు రూ.99,870 భక్తులు కానుకల ద్వారా హుండీలో సమర్పించినట్లు ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

గ్రామ పెద్దలు, ఆలయ ఈఓ సమక్షంలో ఈ లెక్కింపు జరిగింది. గత ఏడాది కన్నా ఈ సారి భక్తులు అధిక మొత్తంలో కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటసుబ్బయ్య, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, గ్రామ నేతలు లక్ష్మీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



చూడగానే ఈ విద్యుత్ స్తంభాలు భయంగొలిపేలా ఉన్నాయి. ప్రస్తుతానికి ఇవి నేలవైపు ఒరిగాయి. అదే పట్టు తప్పి నీటిలోకి జారాయంటే.. అంతేగతి. లింగాల మండలం కామసముద్రం చెరువును ఆనుకుని హైఓల్టేజీ విద్యుత్ లైను వెళుతోంది. ఇందులో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగిపోయాయి. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగు స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. విద్యుత్ స్తంభాల పక్కన గుంతలు ఉండడంతో ఇవి ఒరిగిపోయాయని రైతులు పేర్కొన్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు గుంతలను పూడ్చి విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

(లింగాల, ఆంధ్రజ్యోతి)

ఈ -పంట నమోదు చేసుకోవాలి

వీరపునాయునిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన ప్రతి రైతూ ఇ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్ బాబు రైతులకు సూచించారు. బుధవారం ఉరుటూరులో జరుగుతున్న ఇ-పంట నమోదు కార్యక్ర మాన్ని పరిశీలించారు. ఎటువంటి అవకతవకలు లేకుండా ఖచ్చితంగా పంట నమోదు చేయాలని సూచించారు. శనగ, వేరుశనగ, మినుము, పెసర, జొన్న, వరి, పొద్దుతిరుగుడు, నువ్వులు సాగుచేసిన రైతులు పంటల బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సుష్మ, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించండి


విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్లు స్నేహ, శాంతకుమార్

పులివెందుల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని నగరిగుట్ట, బాకరాపురం యూపీహెచ్‌సీ డాక్టర్లు స్నేహ, శాంతకుమార్ సూచించారు. బుధవారం అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో రాష్ట్రీయ బాల ఆరోగ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలుపరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు, జ్వరం, దగ్గు, గొంతు సమస్యలు, తలనొప్పి, బీపీ, కామెర్లు, నొప్పులు, షుగర్, రక్తశాతం తదితర పరీక్షలు నిర్వహించి నమోదు చేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య ప్రగతి సూచించే రికార్డును అందించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండల పూజ

వేంపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిశాల వద్ద అయ్యప్ప స్వామి మండల పూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అంబుకం పూజ నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించారు. అయ్యప్ప స్వాములందరికీ భిక్ష ఏర్పాటు చేశారు. ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వన భోజనమహోత్సవం

కడప కల్చరల్ నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని రాజరాజేశ్వరి భక్త మండలి సభ్యులు పుష్పగిరి పుణ్యక్షేత్రంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. నగరంలోని రాజరా జేశ్వరీ దేవి ఆలయ ప్రధాన అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ, రాజరాజేశ్వరి భక్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం వైద్య నాథస్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, తులసి దామోదర పూజ నిర్వహించారు. మధ్యా హ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నరసింహరావు, హైమా వతి, వాణి, నారాయణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు రూ.10లక్షలు మంజూరు

వేంపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌కు రూ.10లక్షలు మంజూరైందని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. ఇటీవల వేంపల్లెకు వచ్చిన పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి స్థానిక నేతలు విద్యార్థుల వివరించారు. దీంతో స్పందించిన ఆయన చొరవ తీసుకుని ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

శిల్పారామంలో ఉద్యోగుల వనభోజనాలు


మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న శిల్పారామం, లేక్ సిబ్బంది

పులివెందుల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌లలో కార్తీక వన భోజనాలు చేశారు. బుధవారం పరిపాలన అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఆయా సిబ్బంది ఉసిరిచెట్ల కింద భోజనాలు చేశారు. అనంతరం మ్యూజికల్ చైర్, స్పూన్‌తో లెమన్, తాడులాగుట పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏఓ సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. ఏఈ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంతోష్ విజేతకు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతిక శాస్త్ర పరిశోధకులు జె.సంతోష్ విజేతకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాఖ ప్రొఫెసరు డాక్టర్ సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో 'ఆర్టికల్ కేరక్టరేజేషన్ ఆఫ్ రేర్ ఎర్త్ అయాన్స్ డోపెడ్ బోరో పాస్ఫోజిక్ సంగ్ చేజ్ గ్లాసెస్' అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్టారావు తెలిపారు.

ప్రసన్నవిశ్వేశ్వరుడి సేవలో కడప ఎమ్మెల్యే దంపతులు


ఆలయంలో పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

కడప కల్చరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రసన్నవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి, ఆమె భర్త, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని మోచంపేటలో వెలసిన దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఓ శ్రీధర్ ఆలయ అర్చకులు రవిశంకర్ వారిని సత్కరించారు.

ఖాదర్‌వల్లిని స్వదేశానికి రప్పించండి

ఎమ్మెల్యేకి బాధితుని తండ్రి వినతి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట షంషాద్ కుమారుడు షేక్ ఖాదర్‌వల్లిని స్వదేశానికి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తండ్రి షంషాద్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవిని కలిసి వినతిపత్రం అందించారు. తన కుమారుడు ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లాడన్నారు. పనిచేస్తున్న చోట గ్యాస్‌సిలిండరు పేలడంతో ఖాదర్ వల్లిని బాధ్యుడుగా చేసి ఇండియాకు రాకుండా బంధించారన్నారు. ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికితీసుకెళ్లి స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మనోహరం మణికంఠుడి గ్రామోత్సవం


అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

చెన్నూరు నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): హరిహర సుతుడు మణికంఠుడి గ్రామోత్సవం చెన్నూరులో కన్నుల పండువగా జరిగింది. పూల రథంపై మణికంఠుని అధిష్టింపచేసి పురవీధుల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రివరకూ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు 2 వేల మందికిపైగా అయ్యప్ప భక్తులు పాల్గొన్న గ్రామోత్సవంతో చెన్నూరు శరణుఘోష హోరెత్తింది. ప్రధాన కలశాలతో గురుస్వాములు, మహిళలు, బాలికలు జ్యోతులు చేతపట్టి పాల్గొన్నారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన కేరళ విద్యార్థులు


యూసీఐఎల్ గురించి తెలుసుకుంటున్న కేరళ విద్యార్థులు

వేముల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్‌ను కేరళలోని క్రైస్ట్ కాలేజీ విద్యార్థులు బుధవారం సందర్శించారు. 70వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్ ఆధ్వర్యంలో యూసీఐఎల్ యూనిట్‌ను సందర్శించారు. యూసీఐఎల్ అధికారులు విపిన్‌కుమార్ శర్మ, ఎన్‌వీ రాజేష్, సుమన్ సర్కార్, కిషోర్ భగత్ న్యూక్లియర్ ఎనర్జీ బెనిఫిట్స్ సేఫ్ ఎనర్జీ ప్రొడక్షన్ వివరించారు. యురేనియం వెలికితీత, పరికరాలు, ప్రాసెసింగ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో 350 మంది విద్యార్థులు ప్రొఫెసర్, డీన్ శ్రీ లింటో అలప్పట్, అమ్జద్ అలీ, నాయక్, కోటేశ్వరరావు, సోం జోయ్ చటర్జీ, వాసుదేవ్‌రెడ్డి, భద్రోదాస్ తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై దాడులు చేస్తే సహించేప్రసక్తే లేదు'

కడప మారుతీనగర్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): దళితులపై ఎక్కడ దాడులు జరిగినా సహించే ప్రసక్తేలేదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్, రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళపాక వినోద్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితుల అభివృద్ధి మంటగలిసిందని, రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులను కూడా కాలరాయడం దారుణమన్నారు. దళితుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు.

సీమ మహిళా అధ్యక్షురాలిగా బండి నీతు

సమావేశానంతరం రాయలసీమ మహిళా నూతన అధ్యక్షురాలిగా బండి నీతు, రాష్ట్ర సమన్వయ కర్తగా మేకల ఓబులేసును నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటరమణ, వినయ్‌సాగర్, ఉల్లికిరణ్, సి.కె. కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలు పటిష్టంగా నిర్వహించాలి

చెన్నూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు, చిన్నమాచుపల్లి, ఆలంఖాన్‌పల్లె, ఉక్కాయపల్లె, కడప, సాగునీటి సంఘాలకు డిసెంబరు 8న జరిగే ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలని నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ శిక్షకుడు గంగిరెడ్డి అన్నారు. కడప డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలోని 82, 83, 84, 85, 86, నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించనుందన్నారు. కావున పీఓలు, ఏపీఓలు తమ పరిధిలోని నీటి సంఘాల ఓటర్ల జాబితా, తదితరులతో సిద్దంగా వుండాలని సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, ఇతర అధికారులు పరిశీలించారు.

రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్, సౌత్ జోన్, ఈస్ట్ గోదావరి జట్లు విజయం

కడప స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్ డే క్రికెట్ మ్యాచ్‌ల లో భాగంగా వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్, ఈస్ట్ గోదావరి జట్లు విజయం సాధించాయి. వివరాలిలా...

కేఎస్ఆర్ఎం మైదానంలో

కేఎస్ఆర్ఎం మైదానంలో ప్రకాశం- రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 37 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 36.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి విజయభేరి మోగించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

ఏసీఏ మైదానంలో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ - ఈస్ట్ గోదావరి జట్ల మధ్యసాగిన మరో మ్యాచ్‌లో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్‌కు దిగి 38.2 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 32.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 2 వికెట్లతో గెలుపొందింది.

కేఓఆర్ఎం మైదానంలో

కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం- రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 27.4 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 14.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 101 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.

వేడుకగా కల్యాణోత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చైతన్య రెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దచెప్పలిలో వెలసిన అతి పురాతనమైన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కన్నులపండువగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆకుల నరేంద్ర, రెడ్డయ్య దంపతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు

పెద్దచెప్పలిలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి, శివపార్వతుల కల్యాణానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం కల్యాణాన్ని తిలకించారు.

'పోస్ట్ మాస్టర్ రియాజ్ అహ్మద్ సేవలు అభినందనీయం'

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అత్యధిక గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు సేకరించిన గువ్వలచెరువు బ్రాంచ్ తపాలా పోస్ట్ మాస్టర్ రియాజ్ అహ్మద్ సేవలు అభినందనీయమని ప్రధాన తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ రాజేష్ కొనియాడారు. అత్యధిక గ్రామీణ తపాలా పాలసీలు సేకరించిన రియాజ్ అహ్మద్‌ను ఉత్తమ పోస్ట్ మాస్టర్ సేవలను గుర్తించి బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఆయనకు రాజేష్ బహుమతితో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



బాధితులకు మెగా చెక్కులు పంపిణీ చేస్తున్న సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ / చాపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలో 17 మంది బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పంపిణీ చేశారు. చాపాడు మండలంలోని రాజువారిపేట గ్రామానికి చెందిన పంగా బాలబయన్నకు రూ.13 లక్షలు, మిగతా మండలాలకు చెందిన గుర్రం రామయ్యకు రూ.1.62 లక్షలు, వీర్ల ఖాజాహుస్సేన్‌కు రూ.2.15 లక్షలు, కురాకు సుబ్బరాయుడుకు రూ.1.39 లక్షలు, కోడూరు వీరలక్షుమ్మకు రూ.3 లక్షలు, జంపంగి ఓబుళపతికి రూ.2 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మిగిలిన 11 మంది బాధితులకు రూ.7 లక్షలు మంజూరయ్యాయన్నారు. బాధితులు అనారోగ్యానికి గురైనందున ప్రభుత్వం ఈ డబ్బులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెన్నపూస కిశోర్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మైదుకూరు పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,పొలిమేర శివశంకర్‌రెడ్డి, మైదుకూరు, బి.మఠం, ఖాజీపేట, దువ్వూరు మండల నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బాలిరెడ్డికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుచ్చిరెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించండి



పొలంలో రైతులతో వ్యవసాయాధికారులు

ఎర్రగుంట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ దిగుబడికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఏ.నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఎర్రగుంట్ల మండలంలోని హనుమనగుత్తి పొలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కంది, శనగ, పంటలలో అనుసరించాల్సిన పద్ధతులను తెలిపారు. పంటల బీమాను చేసుకునేందుకు డిసెంబరు 15వ తేదీ ఆఖరు తేదీగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఏవీ నరసింహారెడ్డి, ఏవో శ్రీకాంత్‌రెడ్డి, సహాయకుడు పవన్, రైతులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం



ముద్దనూరు నవంబరు27(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో ఉన్న బీజేపీ కార్యకర్తకు మండల బీజేపీ నాయకుడు మధుసూదనరెడ్డి,బీజేపీ యువనేత గుణవంత్‌రెడ్డి బుధవారం ఆర్థిక సహాయం అందించారు.స్థానిక కొత్తకొట్టాలు వీధిలో నివాసం ఉంటున్న బీజేపీ కార్యకర్త మారుతిశివ కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా మధుసూదన్‌రెడ్డి, గుణవంత్‌రెడ్డి కార్యకర్త ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి, లక్షరూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో బడుగు సురేష్, సాగర్,వినోద్, సుబ్బరాయుడు, నాగరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలి

ఖాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఏవో నాగార్జున అన్నారు. బుధవారం కూనవారిపల్లె పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శనగ పంటకు వేరుకుళ్లు

ఆందోళనలో అన్నదాతలు

రాజుపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రబీ లో ప్రధాన పంట అయిన శనగ పంట సాగు చేసి ఇప్పటికీ 20 నుంచి 30 రోజులు అవు తుంది. అయితే ఈ పంటలో వేరుకుళ్లు, ఎండు తెగులు కనిపిస్తున్నాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతు లు విత్తనశుద్ధిలో తేడా రావడంతోనో, లేకపోతే భూమిలో వేడి ఎక్కువగా ఉండడంతోనో ఈ విధంగా కనబడుతుందని కొంత మంది రైతులు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా ఎకరాకు ఇప్పుడే 5 శాతం నుంచి 10 శాతం వరకు రోజురోజుకూ మొక్కలు ఎండి పోతుండడంతో రైతన్నలకు ఆందోళన మొదలైంది. మండలంలో దాదాపు 8వేల ఎకరాలు పైబడి ఈ పంట సాగులో ఉంది. ముఖ్యంగా చిన్నశెట్టిపల్లె, పొట్టిపాడుకు శనగ పంట ప్రధానంగా సాగు చేస్తారు. పంటలను పరిశీలించడంతో పాటు వేరుకుళ్లు, ఎండు తెగు లు నివారణకు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు, మొక్కకు మొక్క రోజురోజుకూ వ్యాప్తి చెందుతుందని రైతులు తెలిపారు.

పంటమార్పిడి చేయాలి : శివరామక్రిష్ణారెడ్డి, ఏవో

శనగలో వేరుకుళ్లు, ఎండుతెగులు కనబడుతున్నాయని రైతులు తెలియజేయడంతో పాటు శనగ పంట చేనును పరిశీలించినట్లు తెలిపారు. అయితే ఈ వేరుకుళ్లకు ప్రధాన కారణం పంట మార్పిడి లేకపోవడం, విత్తనశుద్ధిలో తేడా, భూమిలో వేడి ఉన్నందున ఈ విధంగా వేరుకుళ్లు, ఎండుతెగులు కనబడుతున్నాయని తెలిపారు. ఈ వేరుకుళ్లు వ్యాప్తి చెందకుండా కాంటాఫ్ అనే మందును లీటరు నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా అవతార్ అనే మందును కూడా ఒక లీటరు నీటికి 2 గ్రాముల పౌడరు కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అందులో ఏదోక మందు అయినా పనిచేస్తుందని రైతులు గమనించాలని ఆయన తెలిపారు.



ఎండు తెగులు సోకిన శనగపంట



ఎండిపోయిన మొక్క

పంచాయతీల ఆదాయాన్ని పెంచాలి : ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచులకు సర్వాధికారాలు ఉన్నాయని విధివిధానాలు పాటిస్తూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పంచాయతీల ఆదాయాన్ని పెంచాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శేఖర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అన్ని మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, శుభ్రత తదితర పర్యవేక్షణ చర్యలు చేపట్టి గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని పేర్కొన్నారు. సహకార సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఓఎన్‌డీసీ, ఈ-కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా అమ్ముకోవచ్చునని వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మ తెలిపారు. దొరసానిపల్లెలో వీధిలైట్ల సమస్యపై తాను స్వయంగా సర్పంచు, కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని జడ్పీ చైర్‌పర్సన్ శారదమ్మ ఈ సందర్భంగా ప్రస్తావించగా సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. నీటి సంఘాల ఎన్నికల్లో ఆయకట్టు రైతులు క్రియాశీలకంగా వ్యవహరించాలని మైలవరం, కేసీ కాలువల శాఖాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, మండల పరిధిలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా వరి పంట కోత దశలో ఉండడంతో రైతులకు ప్రభుత్వం నుంచి లభించే కనీస మద్దతు ధర విషయంపై వ్యవసాయాధికారులతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడి ఆరా తీశారు.

సీపీఎం రెండో మహాసభలు జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం రెండో మహాసభలు జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో జరగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం రెండో మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం జెండా ఆవిష్కరణ తరువాత మహాసభలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ సభకు అందరూ హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఎర్రచందనం రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి : డీఎఫ్‌వో



అటవీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎఫ్‌వో రాజశేఖర్

పోరుమామిళ్ల,నవంబరు27(ఆంధ్రజ్యోతి):ఎర్రచందనం పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎఫ్‌వో రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన పోరుమామిళ్ల రేంజ్ పరిధిలో ఎర్రచందనం ఉన్న ప్రదేశాలు, బేస్ క్యాంపులు టైగర్ కారిడార్ పనులను తనిఖీ చేశారు. జిల్లా సరిహద్దు పెద్దబావి బీట్ వద్ద మల్లవాగు బేస్‌క్యాంపులో మంగళవారం రాత్రి బస చేశారు. బుధవారం పోరుమామిళ్ల రేంజ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఎర్రచందనం వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాలసిన జాగ్రత్తలు, సలహాలు తెలిపారు. కార్యక్రమంలో నిఘా విభాగం రేంజ్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి, పోరుమామిళ్ల రేంజ్ అధికారి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కాశినాయన..: ప్రొటక్షన్ వాచర్లు విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని డీఎఫ్‌వో రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు.బుధవారం మండలంలోని ఇటుకులపాడు బీట్ పరిధిలోని నల్లమల రిజర్వు అడవులు, అందులోని ఎర్రచందనం చెట్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు.బుగ్గ బేస్ క్యాంపును తనిఖీచేసి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలుసూచనలు, సలహాలు అందజేశారు.ఈకార్యక్రమంలో స్క్వాడ్ రేంజ్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి,సెక్షన్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎఫ్‌బీవో వెంకటేష్ పాల్గొన్నారు.

కేపీ ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



మైదుకూరు రూరల్,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేపీ ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు బద్వేల్ ఆర్‌డీఓ చంద్రమోహన్ బుధవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో స్థల పరిశీలన చేశారు. కేపీ ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు స్థలానికి దారితో పాటు రికార్డులు పరిశీలించారు.ఈ స్థల పరిశీలనకు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు విద్యారాణి,ఫిరోజ్,కాంతిశ్రీ, బీజేపీ నాయకులు బీపీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

బద్వేలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామని మండలాధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీపీ మల్లీశ్వరి అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య పనులకు బిల్లులు సకాలంలో చెల్లిస్తామని ఇతర అబివృద్ధి పనులను కూడా నిధులు సమకూరుస్తున్నామన్నారు. తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు మాట్లాడుతూ డిసెంబరు నెల మొదటి వారం నుంచి మీఇంటికి మీభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వి.చిన్నపోలిరెడ్డి,ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పెద్దలకు కట్టబెట్టడం తగదు

బద్వేలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు పెద్దలకు కట్టబెట్టడం తగదని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం దళితహక్కుల పోరాట సమితి నియోజక వర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్కెంగుండ్ల నుంచి అట్లూరు వరకు వందల ఎకరాల దళితుల అసైన్‌మెంటు భూములు పెద్దల చేతులలో ఉన్నాయని వాటిని నిజమైన లబ్ధిదారులకు అప్పచెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

చాపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామంలో సాగు చేసిన వరి పైరును కడప ఊటుకూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు సుధాకర్‌రెడ్డి, వీరయ్య, శ్రీవల్లి, పుష్పలత బుధవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన బీపీటీ 5204 రకం వరి పైరు నాశిరకంగా ఉందని రైతులు వెంకటసుబ్బయ్య, పుల్లమ్మ, ఇంకా కొంతమంది శాస్త్రవేత్తలకు చూపించారు. ప్రస్తుతం పైరు కోత దశకు చేరుకుంది. కానీ వరి కంకులు పొట్టిగా, గింజలు తక్కువగా ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. వీటిని శాస్త్రవేత్తలు పరిశీలించారు. వరి కంకులను ల్యాబ్‌లో పరీక్షలు జరిపి పూర్తి వివరాలు తెలియజేస్తామని శాస్త్రవేత్తలు రైతులకు చెప్పారు. శాస్త్రవేత్తల వెంట ఏవో మ్యాగి, విలేజీ అగ్రికల్చర్ అధికారులు ఉన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

ఖాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భర్త వేధిస్తున్నాడని సంజీవనగరం గ్రామానికి చెందిన కదీరున్నీసా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన ప్రభాకర్‌తో నాలుగు సంవత్సరాల క్రితం కదీరున్నీసాకు వివాహం జరిగింది. కొన్ని రోజుల కిందటి నుంచి భర్త ప్రభాకర్, అత్త మరియమ్మ వేధింపులకు గురిచేస్తుండడంతో భరించలేక స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

ఎట్టకేలకు పనిచేస్తున్న సిగ్నల్స్



బద్వేలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గతకొన్ని నెలలుగా పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న సిగ్నల్స్ పనిచేయని విషయం ప్రజలకు, వాహనదారులకు తెలిసిందే. దీంతో పలువురు వాహనదారులు తమ ఇష్ట మొచ్చిన రీతిలో వెళ్తుండడం జరిగింది. కొన్ని చిన్న చిన్న పొరపాట్ల కారణంగా పలువురు ఘర్షణ పడిన సంఘటనలు ఉన్నాయి. అయితే వీటన్నింటికి చెక్ పెడుతూ సాయి విద్యానికేతన్ కరస్పాండెంట్, మానవత సంస్థ అధ్యక్షుడు కొండారెడ్డి తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. దీంతో యథావిధిగా సిగ్నల్స్ కొనసాగుతుండడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

● ఘనంగా వనసమారాధన మహోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు కలిసి, మెలసి ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వేణుగోపాలాచారి పేర్కొన్నారు. బుధవారం కామనూరులోని కుందూ నది ఒడ్డున అఖిల భారత బ్రాహ్మణ ఉత్తరక్రియ పుణ్యధామం నిర్మిస్తున్న సందర్భంగా వనసమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఎక్కడా పుణ్యధామానికి భవనం లేదని, ప్రొద్దుటూరులో మొదటి సారిగా భవన నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఉత్తరక్రియ పుణ్యధామం నిర్మించడానికి స్థలం మంజూరు చేయాలని కోరడంతో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం మంజూరు చేయించామన్నారు. ఈ సందర్భంగా ఉత్తరక్రియ పుణ్యధామం నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం ఇస్తున్నట్లు దండపాణి శ్రీనివాస్‌కుమార్ ప్రకటించారు. మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శివరామానందసరస్వతి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, జగన్‌మోహన్‌రాజు, అఖిలభారత బ్రాహ్మణ ఉత్తరక్రియ పుణ్యధామ సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెల్లాల కోదండరామశాస్త్రి, కోశాధికారి వెల్లాల నరసింహశాస్త్రి, కుమారస్వామి, కంబగిరిరావు, అంజలికుమార్, సాయినాథ్‌శర్మ, పుల్లయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల శ్రేయస్సే ధ్యేయం

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.సురేష్‌రెడ్డి



ముఖాముఖి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సుకోసం తమ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించే పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన, సహాయ సహకారాలు అందిస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులు అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. ప్రతి కొనుగోలుకు బిల్లును తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలి. ఎవరో ఏదో చెప్పారని పంటకు అనవసరమైన రసాయనాలను వాడకూడదని సూచిస్తున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.సురేష్‌రెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: మీ డివిజన్ పరిధిలో రబీ సాగు ఎలా ఉంది?

జవాబు: ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో రబీ సాగు 32 వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. ఇప్పటికి 24 వేల హెక్టార్లలో సాగు ఉంది. ఇంకా రైతులు పంట సాగును చేపడుతున్నారు. పూర్తిస్థాయిలో పంట సాగు అందుబాటులోకి వస్తుంది.

ప్రశ్న: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు కదా? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎఫ్‌సీవో యాక్టు ప్రకారం ఎరువులు, విత్తనాలు, తదితరవి ఎమ్మార్పీకే కచ్చితంగా అమ్మాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వస్తే షోకాజ్ నోటీసులు ఇవ్వడం, అవసరం అయితే దుకాణాల లైసెన్సులను రద్దుకు సిఫార్సు చర్యలు చేపడుతాం.

ప్రశ్న: మట్టి నమూనాలు ఎన్ని సేకరించాలని లక్ష్యం ఉంది. ఎన్ని సేకరించారు?

జవాబు: డివిజన్ పరిధిలో 1990 మట్టి నమూనాలు సేకరించాం. మైలవరం మండల పరిధిలో 530, జమ్మలమడుగులో 470, పెద్దముడియంలో 530, ప్రొద్దుటూరు మండల పరిధిలో 460 నమూనాల సేకరణ పక్రియ పూర్తయింది.

ప్రశ్న: భూసార పరీక్ష ఫలితాల పత్రాలు రైతులకు ఇంకా అందలేదు కదా?

జవాబు: జమ్మలమడుగులో 380, ప్రొద్దుటూరు మండలంలో 20 మంది రైతులకు పత్రాలు అందించాం. కడపలోని టెస్టింగ్ ల్యాబ్ నుంచి రిపోర్టులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే ఆయా రైతులకు ఫలితాల పత్రాలు అందిస్తాం.

ప్రశ్న: నకిలీ పురుగు మందులు, అనుమతులు లేని బయో ఉత్పత్తుల విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: అనుమతులులేని బయో ఉత్పత్తులు అమ్మడానికి వీలు లేదు. తనిఖీలు, దాడులు చేపడుతున్నాం. పురుగు మందుల శాంపిల్స్ సేకరించి పరీక్షించి నివేదికలో తేడాలు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం. 2021-24 వరకు 23 కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: పంటల బీమా మాటేమిటి?

జవాబు: ఖరీఫ్‌లో బీమాను ప్రభుత్వం కట్టింది. రబీలో రైతులే ప్రీమియం చెల్లించుకోవాలి. ఎనిమిది రకాల పంటలకు బీమా సౌకర్యం ఉంది. రైతులకు అవగాహన కల్పించి వారిని చైతన్యపరుస్తున్నాం.


రేపు మండల సమావేశం

మైలవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం ఎంపీడీవో కార్యాలయ సభాభవనం ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మండల అధికారులు సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

రుద్రహోమం...

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 29వ తేదీ రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 6 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తామని, సాయంత్రం గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

జ్యోతి క్షేత్రాన్ని సందర్శించిన ఆర్డీవో



కాశినాయన, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కాశి నాయన మండలంలోని జ్యోతిక్షేత్రాన్ని బుధవారం బద్వేల్ ఆర్డీవో చంద్రమౌళి సందర్శించారు.కాశినాయన పాలరాతి సమాధిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జ్యోతిక్షేత్రంలో ఉన్న ఆలయాలు ఇతర నిర్మాణాలు, స్థల వివరాల గురించి తహసీల్దారు వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఐ అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.